క్లుప్తంగా

వైభవంగా అన్న సమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కర్రా జయసరిత

పాలకొల్లు అర్బన్: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గుత్తులవారిపేటలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌ సీపీ మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి కర్రా జయసరిత పాల్గొని భక్తులకు ప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జోగి వెంకటేశ్వరరావు, సభ్యులు, వైఎస్సార్‌ సీపీ నాయకులు జోగాడ ఉమా మహేశ్వరరావు, కడలి రామలక్ష్మి, గంగిరెడ్ల ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

పాల కేంద్రం ప్రారంభం



కాపవరంలో పాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముత్యాల శ్రీనివాస్‌

పాలకొల్లు అర్బన్: సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ కూడా చేయాలని రోటరీ అసిస్టెంట్‌ గవర్నర్‌ ముత్యాల శ్రీనివాస్‌ సూచించారు. మండలంలోని కాపవరంలో ఆదివారం పాల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వరి పండిస్తున్న రైతులు ఏటా నష్టాలను చవిచూస్తున్నారని, పాడి పశువులను పోషించడం ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకులు కసుకుర్తి బుల్లిరాజు, సర్వేశ్వరరావు, రామకృష్ణ, సురేష్‌, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నరసాపురం రూరల్‌: మండలంలోని కాపులకొడప గ్రామంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. విజయదశమి కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్‌ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

దేశాలమ్మకు వెండి మకర తోరణం సమర్పణ



అమ్మవారికి వెండి తోరణాన్ని అలంకరిస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్‌: పట్టణంలోని చింతలతోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మకు వెండి మకర తోరణాన్ని సమర్పించారు. ఆదివారం వైఎస్సార్‌ సీపీ నాయకుడు, దాత అడబాల వెంకటరమణ, వాణి దంపతులు మూడు లక్షలు విలువ చేసే 3 కేజీల వెండితో ఈ తోరణాన్ని తయారు చేయించారు. ముందుగా ఆలయ అర్చకులు మకర తోరణానికి పూజలు నిర్వహించిన అనంతరం దాతలు అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ అధ్యక్షులు వలిరెడ్డి వరహాలు, సెక్రటరీ శిడగం చంద్రశేఖర్‌, శిడగం సురేంద్ర, అలుగు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రతన్‌ టాటాకు ఘన నివాళి

భీమవరం: నీతి నిజాయితీ, విలువలకు నిలువెత్తు నిదర్శనం రతన్‌ టాటా అని, ఆయన మరణం ప్రపంచానికే తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. భీమవరంలో శ్రీ విజ్ఞాన వేదిక, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం రతన్‌ టాటా సంతాప సభ నిర్వహించారు. ముందుగా రతన్‌ టాటా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిల్డర్స్‌ అసోసియేషన్‌ గౌరవాధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్‌, అరేటీ ప్రకాష్‌, చినిమిల్లి వెంకట్రాయుడు, వబిలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచం ఒక విలువైన రత్నాన్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు యేలేటి న్యూటన్‌, ఉండపల్లి రమేష్‌నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, నందమూరి రాజేష్‌, కారుమూరి చిన బాబు పాల్గొన్నారు.

నిలిచిన స్పెషల్‌ డ్రింకింగ్‌ ప్రాజెక్ట్‌ పనులు

- నిలిచిపోయిన స్పెషల్‌ డ్రింకింగ్‌ ప్రాజెక్ట్‌ పనులు
- గత ప్రభుత్వంలో నరసాపురం మున్సిపాలిటీకి ప్రాజెక్ట్‌ మంజూరు
- రూ.81.81 కోట్లతో మంచినీటి పైప్‌లైన్ల ప్రక్షాళన
- రూ.61.81 కోట్ల పనులకు టెండర్లు కూడా పూర్తి



భారీ విస్తీర్ణంలో ఉన్న నరసాపురం మంచినీటి కుళాయి చెరువు



పంజా సెంటర్‌లో పైప్‌లైన్‌ లీకేజ్‌ మరమ్మతులు చేస్తున్న దృశ్యం(ఫైల్‌)

నరసాపురం: నరసాపురం నియోజకవర్గానికి గత ప్రభుత్వం మంజూరు చేసిన భారీ ప్రాజెక్టులు ఒక్కొక్కటీ వెనక్కి వెళ్తున్నాయి. ప్రభుత్వం మారడంతో పనులు అయోమయంలో పడుతున్నాయి. తాజాగా నరసాపురం మున్సిపాలిటీకి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసి, నిధులు కూడా విడుదల చేసిన స్పెషల్‌ డ్రింకింగ్‌ ప్రాజెక్ట్‌ పనులు అయోమయంలో పడ్డాయి. నిధులు కూడా అందుబాటులో ఉండడంతో నిజానికి ఈ పనులు ఇప్పటికే మొదలు కావాల్సిండగా కూటమి ప్రభుత్వం ఉలుకూ పలుకూ లేకుండా ఉంది. నరసాపురం మున్సిపాలిటీలో పాత పైప్‌లైన్లను పూర్తిగా ఆధునికీకరించడంతో పాటుగా అదనంగా ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం చేపట్టడానికి వీలుగా గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో రూ.81.81 కోట్లతో స్పెషల్‌ డ్రింకింగ్‌ ప్రాజెక్ట్‌ నిర్మించాలని నిర్ణయించింది. ప్రాజెక్టుకు సంబంధించి సాంకేతిక అనుమతులు ఇస్తూ మున్సిపల్‌ అడ్మినిస్ట్రేటివ్‌ అండ్‌ అర్బన్‌ డెవలెప్‌మెంట్‌ శాఖ జీఓ నెంబర్‌ 15 విడుదల చేసింది. ముందుగా ప్రాజెక్ట్‌ నిమిత్తం రూ.61.81 కోట్లు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటి విడతలో రూ.61.81 కోట్లు పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. ఈ ప్రాజెక్ట్‌తో 50 ఏళ్ల దీర్ఘకాల మంచినీటి సరఫరా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భావించారు. అయితే ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి.

ఇదీ స్పెషల్‌ డ్రింకింగ్‌ ప్రాజెక్ట్‌ స్వరూపం

పట్టణంలో ప్రస్తుతం 3 ఓహెచ్‌ఆర్‌లు ఉన్నాయి. స్పెషల్‌ ప్రాజెక్ట్‌లో భాగంగా మరో నాలుగు ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణాలు కూడా ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పట్టణంలో 96 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌లు ఉన్నాయి. వీటిలో 40 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌లు పూర్వం ఎప్పుడో 1966లో వేసినవే. వాటిని పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని నిర్ణయించారు. అలాగే కొత్తగా దాదాపు మరో 30 కిలోమీటర్ల మేర శివారు ప్రాంతాలకు పైప్‌లైన్లు నిర్మించాలని అనుకున్నారు. నీటిశుద్ధి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించే విధంగా ప్రాజెక్ట్‌ రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్ట్‌ పూర్తయితే పట్టణంలో ఇక మరో 30 ఏళ్ల వరకూ మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. దీంతో పట్టణ వాసులు ఆనందపడ్డారు. అయితే ప్రజల ఆనందం కూటమి ప్రభుత్వ తీరుతో ఆవిరైంది.

అందుబాటులో నిధులు



స్పెషల్‌ డ్రింకింగ్‌ ప్రాజెక్ట్‌ నిమిత్తం వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం పక్కా జీవోతో నిధులు విడుదల చేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. మున్సిపాలిటీలో అప్పటి ప్రభుత్వ చీఫ్‌విప్‌ ముదునూరి ప్రసాదరాజు కృషితో శాశ్వత అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ రూపకల్పన చేశారు. ఎప్పటి నుంచో సమస్యగా ఉన్న పైప్‌లైన్స్‌ ఆధునికీకరణకు అప్పట్లో మేము పూనుకున్నాము. పనులు నిలిచిపోవడం దారుణం. నిధులు అందుబాటులో ఉండి కూడా పనులు సాగించే ప్రయత్నం చేకపోవడం దారుణం.

–బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌

ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

నరసాపురం: విజయదశమి పర్వదినం సందర్భంగా శనివారం పట్టణంలోని అన్ని అమ్మవార్ల ఆలయాల్లో పూజలు ఘనంగా జరిగాయి. గడ్డిబజార్‌లోని ప్రసిద్ధ కనకదుర్గ ఆలయం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. పాతబజార్‌ వలవలవారివీధిలో భద్రాద్రి రామసాయి మందిర్‌లో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. వలవల విజయ్‌ దంపతులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. రాయిపేట పుంతలోముసలమ్మ అమ్మవారి అలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్టీమర్‌రోడ్డు పండ్ల మార్కెట్‌ వద్ద ఉత్సవాలు ముగిశాయి. శ్రీరాజరాజేశ్వరి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లడ్డూ వేలంపాటలో రూ.19500లకు చిట్టూరి కృష్ణ దక్కించుకున్నారు. ఆలయకమిటీ ప్రతినిధులు గునిశెట్టి సత్యనారాయణ, మండెల కృష్ణ, గునిశెట్టి శ్రీనివాస్‌ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చిన మామిడిపల్లిల్లో బళ్ల తాతాజీ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. భారీ అన్నసమారాధన నిర్వహించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: శరన్నవరాత్రులు ఘనంగా ముగిశాయి. శనివారం ఆఖరి రోజున అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి విజయదశమి ఘనంగా జరుపుకున్నారు. స్థానిక భవానీ కాలనీలోని కనక దుర్గమ్మ అమ్మవారు. పార్వతీ విశ్వేశ్వర స్వామి ఆలయంలోనూ అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. చాలా ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ముత్యాలపల్లి, కొత్తోట, పేరుపాలెం, కెపిపాలెం, రామన్నపాలెం, శేరేపాలెం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

పోలీస్‌ స్టేషన్‌లో శమీ పూజ

మొగల్తూరు: నవరాత్రులు చివరిరోజైన శనవారం నాడు విజయ దశమి రోజున శమీ పూజ నిర్వహించారు. మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జి.వాసుతో ప్రముఖ పండితులు బాపన్న ఆయుధ పూజ జరిపించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్‌: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో దేవిశరన్నవరాత్రుల ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం విజయదశని పురస్కరించుకుని అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరణ చేశారు. క్షీరా రామలింగేశ్వర స్వామి దీపాల కాంతుల్లో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారు, అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాకార మండపం వద్ద జమ్మి చెట్టుకు ప్రదక్షిణలు, పూజలు చేశారు. పట్టణంలో పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలు వద్ద జమ్మిచెట్టుకు పూజలు చేసి దీపాలంకరణలు చేశారు. ఆదివారం కొన్ని ప్రదేశాల్లో అమ్మవారిని నిమజ్జనం చేశారు. పట్టణంలో చిత్రావిచెరువు గట్టున ఏర్పాటుచేసిన అమ్మవారిని ఊరేగింపుగా తరలించి కాలువల్లో నిమజ్జనం చేశారు.

పెనుమంట్రలో...

పెనుమంట్ర: మండలంలో వివిధ గ్రామాలలో శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా అమ్మవార్ల ఊరేగింపు ఉత్సవాలు నిమజ్జనోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. మార్టేరులో శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేసి, ఆలయంలో మూలవిరాట్‌ను పలువురు భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌ తేతలి రాజారెడ్డి ఆధ్వర్యంలో పదిరోజుల పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించగా శనివారం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. నెగ్గిపూడి గ్రామంలో శ్రీవనుములమ్మ, శ్రీకనకదుర్గమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన వనుములమ్మ, కనకదుర్గమ్మ వారాహి అమ్మవార్ల ప్రతిమలను ఆదివారం నిమజ్జనోత్సవం నిర్వహించారు. పురోహితుడు భగవాన్‌ ఆధ్వర్యంలో పదిరోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నత్తారామేశ్వరం గ్రామంలో శ్రీవిజయదుర్గ ఆలయం వద్ద గురు భవాని పోతంశెట్టి భాస్కరరావు ఆధ్వర్యంలో అమ్మవారి నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించి, మాలధారణ చేసిన భవానీలు విజయవాడ దుర్గమ్మ దర్శనానికి బయలుదేరి వెళ్లారు.

పెనుగొండ:

పెనుగొండ: శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాలు సందర్భంగా శనివారం సాయంత్రం పెనుగొండ మండలంలో గ్రామోత్సవాలు నిర్వహించారు. సిద్ధాంతం దేవీ సెంటర్‌లో దీపోత్సవం నిర్వహించారు. శివలింగం, వేంకటేశ్వర స్వామి, వినాయకుడు వంటి ఆకృతులు ఆకట్టుకున్నాయి. ప్రకాశరావు నగర్‌, చినమల్లంల్లో కనకదుర్గమ్మ వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. వడలిలో జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి దసరా ఉత్సవాలు నిర్వహించారు. శనివారం తెల్లవారే వరకూ గ్రామోత్సవం నిర్వహించారు.



పెనుగొండ: వడలిలో జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



నరసాపురం: గడ్డిబజార్‌లో ఆకట్టుకున్న అమ్మవారి అలంకరణ



మొగల్తూరు: కూరగాయల మార్కెట్‌లో రాజరాజేశ్వరీదేవి అలంకరణ



పాలకొల్లు సెంట్రల్‌: రాజరాజేశ్వరి దేవిగా అలంకరించిన దృశ్యం



పెనుమంట్ర: ప్రత్యేకాలంకరణలో మార్టేరు కనకదుర్గమ్మ

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. శరన్నవరాత్రులు పూర్తికావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆలయ ఈఓ ఎం.అరుణ్‌ కుమార్‌ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్‌ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

నేడు మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం

పెనుమంట్ర: పెనుమంట్ర మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం ఈనెల 14న మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్‌ అధ్యక్షుడు కర్రి వెంకట నారాయణరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొంటారని, సమావేశానికి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

రోగులకు వసుధ ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: వైద్య, విద్య, సామాజిక వర్గాల ప్రయోజనాల కోసం వసుధ ఫౌండేషన్‌ చైర్మన్‌ మంతెన వెంకట్రామరాజు చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రముఖ రైస్‌మిల్లర్‌ పెన్మెత్స అరుణ్‌కుమార్‌ రాజు అన్నారు. పోడూరు మండం జిన్నూరు గ్రామానికి చెందిన మారిశెట్టి సింధు అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో సింధు కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితులను గ్రామపెద్దల ద్వారా వసుధ ఫౌండేషన్‌ చైర్మన్‌ మంతెన వెంకట్రామరాజు దృష్టికి రావడంతో ఆయన స్పందించి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయాన్ని రైస్‌ మిల్లర్‌ పెన్మెత్స అరుణ్‌కుమార్‌ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు.అలాగే మొగల్తూరు కి చెందిన తోటకూర వెంకట్రామరాజు ఏడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలో ఉన్నారు. ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితులను తెలుసుకుని వసుధ ఫౌండేషన్‌ చైర్మన్‌ మంతెన వెంకట్రామరాజు రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని వసుధ ఫౌండేషన్‌ కన్వీనర్‌ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా బాధిత కటుంబానికి అందజేశారు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: మండల పిరమిడ్‌ స్పిరిచ్యువల్‌ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీసీతారామ స్వామి దేవస్థానం నందు ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన సీనియర్‌ పిరమిడ్‌ మాస్టర్‌ నున్న అరుణశ్రీ పాల్గొని జ్ఞానబోధ చేసి ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అరుణశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వర్తమానంలో జీవించడం అలవాటు చేసుకోవాలని దానికి శ్వాస మీద ధ్యాస ధ్యాన సాధన బాగా తోడ్పడుతుందని, కర్మ సిద్ధాంతాన్ని అవగాహన చేసుకొని వర్తమానంలో మంచి కర్మలు చేస్తూ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేడిశెట్టి రృష్ణారావు, ముఖేష్‌, వర్రి విశ్వేశ్వరరావు టి.నాగరాజు బి.శ్రీదేవి, వర్రి కృష్ణవేణి, బి.యర్రాయమ్మ,ఆదిరెడ్డి గోపమ్మ, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షలు ప్రారంభం

పెనుమంట్ర: మార్టేరులోని శ్రీఅయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వాముల మాలధారణలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అయ్యప్ప స్వామి ఆలయ అర్చకులు శ్రీనివాసుల వేణుగోపాలచార్యులు తెల్లవారుజామున పూజాధికాలను నిర్వహించగా గురుస్వామి అలబాల శ్రీనివాస్‌ తొలిరోజు 30 మంది భక్తులకు మాలధారణ చేసి మండల దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ తమ ఆలయ పీఠంతో పాటు ఈ పరిసర గ్రామాలలో అయ్యప్ప పీఠాలలో మాలధారణ చేసిన భక్తులకు కూడా తమ పీఠంలో 45 రోజుల పాటు దాతల సహకారంతో ఉచిత అల్పాహారం, భోజన వసతి(భిక్ష) ఏర్పాటు చేశామని, ఈఅవకాశాన్ని పరిసర ప్రాంత మాలధారణ వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు.



మార్టేరులోకన్నెస్వామికి మాలధారణ చేయిస్తున్న గురుస్వామి శ్రీనివాస్‌

కార్తీకమాసం ఏర్పాట్లపై సమావేశం

పాలకొల్లు సెంట్రల్‌: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ప్రతి సోమవారం స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు శ్రీ క్షీరా రామలింగేశ్వర సేవా సమితి సభ్యులు తమ సహాయ సహకారాలను అందిస్తుంటారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ అభిషేక మండపంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శీరం ఆనంద కృష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్తీకమాసం సోమవారం రోజున దర్శనానికి వచ్చే భక్తులకు పాలు, ప్రసాద వితరణ చేస్తుంటామని అన్నారు. ప్రతి సంవత్సరంలానే ఈ ఏడాది కూడా ఏర్పాట్ల నిమిత్తం కమిటీ సభ్యులు చర్చించుకున్నామిన తెలిపారు. కార్యక్రమంలో భాకూరి సత్యనిరంజన్‌, జక్కంపూడి కుమార్‌, ధనాని సూర్యప్రకాష్‌, ధనాని శ్రీరామమూర్తి, మద్దు వాసు, పిరాట్ల శ్రీను, గాది వెంకన్న, చెరుకూరి శ్రీనివాసు, బంగారు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కార్తీకమాస క్షీరారామ లింగేశ్వర సేవా సమితి సభ్యులు

ఉచిత ఇసుక అమలు చేయాలి

భీమవరం: ఉచిత ఇసుక పాలసీని సక్రమంగా అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం మండల కన్వీనర్‌ ఇంజేటి శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. మండలంలోని తోకతిప్పలో ఆదివారం పీఎం ఆధ్వర్యంలో ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్‌ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ మాట్లాడుతూ అధికారం చేపట్టే నాలుగు నెలలు గడిచిపోతున్నా ఉచిత ఇసుక పాలసీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బర్రె రమేష్‌, మోక మీరా సాహెబ్‌, బొడ్డు లక్ష్మీపతి, తిరుమాని నాగేశ్వరావు, సూర్యనారాయణ, పొన్నమంద నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల అందజేత

పాలకొల్లు సెంట్రల్‌: స్థానిక 18వ వార్డులో సేవ్‌ ది హంగ్రీ మినిస్ట్రీ సోషల్‌ ఆర్గనైజేషన్‌ సేవా సంస్థ సభ్యులు కే జక్కరయ్య అనాద విద్యార్థులకు ఏర్పాటు చేసిన మెడికల్‌ క్యాంపు, ఆహార ప్యాకెట్లు, సైకిల్‌ పంపిణీ కార్యక్రమంలో ఆదివారం డీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ యడ్ల తాతాజీ పాల్గొని సైకిళ్లు అందజేశారు. ప్రతీ సంవత్సరం అనాథ పిల్లలకు జక్కరయ్య చేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని తాతాజీ అన్నారు. దేవిశరన్నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా స్థానిక బ్రాడీపేట 1వ వార్డు, 13 వార్డు మిద్దేవారి వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాలను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కోరాడ శ్రీను, చెన్ను విజయ్‌, పెచ్చెట్టి కృష్ణాజీ, పాలపర్తి కృపానాథ్‌, కొండ గణేష్‌, ఉత్సవ కమిటీల సభ్యులు మండేల శ్రీనివాస్‌, సూర్యనారాయణ, కార్తీక్‌, గణేష్‌, ప్రతాప్‌ తదితరులు పాల్గొన్నారు.



సైకిళ్లు పంపిణీ చేస్తున్న తాతాజీ

సాహితీప్రియులకు ఆభరణం

నరసాపురం: శ్రీకృష్ణ కల్యాణ కింకిణి పద్య కావ్యం సాహితీ ప్రియులకు ఆభరణం లాంటిదని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. పేరాల రామలింగేశ్వరరావు శతజయంతి అక్షరోత్సవం సందర్భంగా ఆయన రచించిన శ్రీకృష్ణ కల్యాణ కింకిణి పద్యకావ్యం ద్వితీయ ముద్రణ పుస్తకావిష్కరణ కార్యక్రమం స్థానిక వైఎన్‌ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీఓ దాసి రాజు మాట్లాడుతూ సాహిత్యకారులు మన సమాజానికి సంపదలాంటివారని అన్నారు. పుస్తకావిష్కరణకు నడుంబిగించిన రామలింగేశ్వరరావు తనయుడు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ వ్యక్తిగత సహాయకుడు పేరాల మోహన్‌ను అతిథులు అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌, మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బేతవోలు రామబ్రహ్మం, గురు సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్‌, వైఎన్‌ కళాశాల సెక్రటరీ అండ్‌ కరస్పాండెంట్‌ డాక్టర్‌ చినిమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు